క్లుప్తంగా

ఉత్తమ అధ్యాపకురాలికి సన్మానం



డాక్టర్ అనూషను సన్మానిస్తున్న వీసీ

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీకి చెందిన అధ్యాపకురాలు డాక్టర్ అనూషకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. శుక్రవారం ఆ కాలేజీ అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో ఆడిటోరియంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జ్ వీసీ వెంకట బసవరావు ముఖ్య అతిథిగా పాల్గొని అవార్డు గ్రహీతను సన్మానించారు. వీసీ, ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ ఉపాధ్యాయురాలి సేవలను కొనియాడారు. అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటాలి



రాష్ట్ర పోటీలకు ఎంపికైన సాఫ్ట్‌బాల్ జట్టును అభినందిస్తున్న కుబేరనాయుడు

కర్నూలు (టౌన్): విశాఖపట్నం జిల్లా నర్సీపట్నంలో అక్టోబర్ 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించాలని రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడు ఎం.కుబేరనాయుడు సూచించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి కే.విజయ్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

కలెక్టర్ రంజిత్‌బాషాకు సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న జిల్లా జడ్జి బి.కబర్ధి

కర్నూలు(సెంట్రల్): బదిలీపై వెళ్తున్న కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను జిల్లా జడ్జి బి.కబర్థి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి సన్మానించారు. శుక్రవారం ఉదయం వారు కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి చేరుకొని శాలువా కప్పి బొకే అందజేశారు.

– బదిలీపై వెళ్తున్న పి.రంజిత్ బాషాకు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన వీడ్కోలు పలికారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జేసీ డాక్టర్ బి.నవ్య, ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, గౌరుచరితారెడ్డి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్దన్ రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తదితరులు కలెక్టర్‌ను సన్మానించి ఆయన సేవలను కొనియాడారు.

ఇంజినీరింగ్ విద్యార్థుల ఘర్షణ

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు గురువారం రాత్రి ఘర్షణ పడినట్లు సమాచారం. వర్సిటీ న్యూ హాస్టల్ బిల్డింగ్‌లో మొదటి సంవత్సరం విద్యార్థితో మూడో సంవత్సరం విద్యార్థులు ఘర్షణ పడి దాడి చేసినట్లు తెలిసింది. ఫస్ట్ ఇయర్ స్టూడెంట్‌కు షర్ట్ బటన్ పెట్టుకోమని సీనియర్స్ చెప్పగా అతను పెట్టుకుంటానని చెప్పడంతో మాకే ఎదురు చెప్తావా అంటూ దాడి చేసినట్లు చెబుతున్నారు. ఈ విషయమై రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడును సంప్రదించగా హాస్టల్‌లో ఫస్ట్ ఇయర్, థర్డ్ ఇయర్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఘర్షణ పడుతుంటే పీజీ విద్యార్థులు సర్ది చెప్పారన్నారు. శుక్రవారం ఇంజినీరింగ్ విద్యార్థులు తన వద్దకు వస్తే వారిని మందలించామన్నారు. ఇలాంటి ఘటనలు జరకుండా జాగ్రత్తగా ఉండాలని సర్ది చెప్పి పంపామన్నారు.

బహిరంగ సభ పోస్టర్ల ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: విశ్వకర్మ జయంతి, ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఈనెల 17న విజయవాడలో నిర్వహించనున్న విశ్వకర్మ మహా యజ్ఞం బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళినాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎగ్జిక్యుటివ్ మెంబర్ వీరప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు కళాకారుల సంస్మరణ సభ

కర్నూలు కల్చరల్: కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో కళాకారుల సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి బైలుప్పల షఫీయుల్లా తెలిపారు. ఇటీవల పరమపదించిన సుప్రసిద్ధ రంగస్థల నటులు నంది అవార్డు గ్రహీత వన్నెం బలరాం, కళా సేవకులు కామ్రేడ్ జేఎస్ శేషయ్య సంస్మరణ సభ ఉంటుందని కళాకారులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

కిసాన్ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ నియామకం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మన్‌గా ఏ.సూర్యప్రకాష్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిళ ఆదేశాల మేరకు రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కామన ప్రభాకర రావు నియమక పత్రాన్ని అందజేశారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని, కాంగ్రెస్ పార్టీ తరఫున రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కృషి చేస్తానని సూర్యప్రకాష్‌రెడ్డి వివరించారు.

పొరుగు ఉల్లిపైనే మక్కువ

- కర్నూలు మార్కెట్ కేంద్రంగా మహారాష్ట్ర ఉల్లి విక్రయాలు
- స్థానికంగా ధరలు లేక అల్లాడుతున్న రైతులు
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్





మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకొని మార్కెట్ యార్డులో నిల్వ ఉంచిన ఉల్లి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పండించిన ఉల్లి మార్కెట్ యార్డుకు వెల్లువెత్తుతున్నా మహారాష్ట్ర నుంచి ఉల్లి దిగుమతి చేసుకోవడం మాత్రం ఆగడం లేదు. కర్నూలు జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో ఉల్లి సాగు ఉండగా.. నంద్యాల జిల్లాలో మాత్రం డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మరికొన్ని మండలాల్లో సాగు అవుతోంది. ఇక్కడ పండించిన ఉల్లికి ధరలు పడిపోవడం, కొనేవారు లేక రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం మద్దతు ధర రూ.1200 నిర్ణయించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుంది. స్థానికంగా పండించిన ఉల్లి మార్కెట్‌లో ఉన్నప్పుడు మహారాష్ట్ర నుంచి దిగుమతులను అరికట్టాలి. కానీ దిగుమతులు మాత్రం ఆగడం లేదు. కొందరు వ్యాపారులు మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన ఉల్లి లాట్ల పక్కనే మహారాష్ట్రలోని పూణే, నాసిక్ నుంచి దిగుమతి చేసుకున్న ఉల్లిని ఉంచి అమ్మకాలు సాగిస్తుండటం గమనార్హం. ఇటీవల జిల్లా కలెక్టర్ మహారాష్ట్ర ఉల్లిని దిగుమతి చేసుకోరాదనే ఆదేశాలు ఇచ్చారు. కానీ యార్డులోని జంబోషెడ్‌లో మహారాష్ట్ర ఉల్లి భారీగా ఉండటం చూసి రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్ర ఉల్లిని భారీగా తెప్పిస్తే ఇక్కడి ఉల్లికి డిమాండ్ ఎలా వస్తుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. మహారాష్ట్ర ఉల్లితో పోలిస్తే ఇక్కడి ఉల్లి నాణ్యత తక్కువగా ఉంటుంది. రీటైల్ వ్యాపారులు మహారాష్ట్ర ఉల్లికే ప్రాధాన్యత ఇస్తూ తీసుకుపోతున్నారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన ఉల్లి లేకపోతే స్థానికంగా పండించిన ఉల్లినే కొనుగోలు చేస్తారు. అపుడు ఉల్లికి కొంతవరకు డిమాండ్ వచ్చే అవకాశం ఉంది. మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటూ మార్కెట్ కేంద్రంగా క్రయవిక్రయాలు జరుగుతుండటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది.

పక్వానికి వచ్చాకే ఉల్లి కోతలు చేపట్టాలి



తడకనపల్లిలో ఉల్లి రైతులతో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ డైరెక్టర్ కే.శ్రీనివాసులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లిగడ్డలు బాగా ఊరిన తర్వాతే కోతలు చేపట్టే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యాన శాఖ డైరెక్టర్ కే.శ్రీనివాసులు జిల్లా ఉద్యాన అధికారులను ఆదేశించారు. శుక్రవారం కర్నూలుకు వచ్చిన ఆయన స్థానికంగా ఒక హోటల్‌లో ఉద్యాన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ఉల్లిపై చర్చించారు. ఉల్లి నాట్లు వేసిన తర్వాత 100–110 రోజులు పంట పొలంలో ఉండాలని, కోతలు చేపట్టిన తర్వాత 15 రోజులు బాగా ఆరబెట్టాలన్నారు. ఉల్లిగడ్డలు పక్వానికి రాకముందే కోతలు చేపట్టడం వల్ల మార్కెట్‌లోకి ఉల్లి భారీగా వస్తోందని చెప్పారు. అలాగే నాణ్యత లోపించడంతో పాటు ఆశించిన దిగుబడి రాదని పేర్కొన్నారు. దీనిపై ఉద్యాన అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ఉల్లి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో సాగైన ఉల్లి, ఉత్పదకత వివరాలపై ఆరా తీశారు. వారానికి మార్కెట్‌లోకి ఎంత ఉల్లి వస్తుందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓర్వకల్, నన్నూరు, కల్లూరు మండలం తడకనపల్లి గ్రామాల్లో పర్యటించి ఉల్లి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. పక్వానికి రాకముందే కోయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సూక్ష్మసేద్యం ప్రగతిని సమీక్షించారు. ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు, ఉద్యాన అధికారులు అనూష, మదన్ మోహన్‌గౌడు తదితరులు ఉన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు (హాస్పిటల్): జిల్లాలో బీఎస్‌ఎన్‌ఎల్ సేవల మెరుగునకు కృషి చేస్తామని ఎంపీ బస్తిపాటి నాగరాజు చెప్పారు. బీఎస్‌ఎన్‌ఎల్ కర్నూలు బిజినెస్ ఏరియా టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక బీఎస్‌ఎన్‌ఎల్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో 22 కొత్త 4జీ టవర్లకు అనుమతి కోసం కేంద్ర టెలికాం సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో కృషి చేశామన్నారు. అన్ని ప్రభుత్వ సంస్థల్లో బీఎస్‌ఎన్‌ఎల్ సేవలను వాడే విధంగా మార్గదర్శకాలు వచ్చేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్ జనరల్ మేనేజర్ జి.రమేష్ మాట్లాడుతూ.. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 36 కొత్త 4జీ టవర్లకు అనుమతి మంజూరైందని, 85 కొత్త 4జీ టవర్లు పరిశీలనలో ఉన్నాయన్నారు. డీజీఎం కె.రాజేశ్వరరావు, అడ్వైజరీ కమిటీ మెంబర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 13న రెండవ శనివారం పూర్తి స్థాయిలో విద్యుత్ సబ్‌స్టేషన్లు, లైన్ల మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు కర్నూలు టౌన్ విద్యుత్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. ఈ నేపథ్యంలో కర్నూలు నగరంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రామీణ విలేకరులకు తరగతులు

- నేడు, రేపు కర్నూలులోని పరిణయ ఫంక్షన్ హాలులో నిర్వహణ

కర్నూలు(సెంట్రల్): సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో కర్నూలు జిల్లా గ్రామీణ విలేకరులకు నిర్వహించనున్న పునశ్చరణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ చైర్మన్ అలపాటి సురేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. కర్నూలులోని మౌర్య ఇన్ హోటల్‌లో ఉన్న పరిణయ ఫంక్షన్ హాలులో రోజు రెండు రోజులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. మొదటి రోజున ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టింగ్, అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) క్రైమ్ రిపోర్టింగ్, అంశాలపై, రెండో రోజు ఆదివారం గ్రామీణ వార్తలు, కథనాలు, పత్రిక భాష, ఫ్యూచర్ రైటింగ్, విలేకరుల నుంచి డెస్కు ఏం కోరుకుంటుంది – డెస్కు కో-ఆర్డినేషన్ అనే అంశాలపై సీనియర్ జర్నలిస్టులతో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్న నేపథ్యంలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మధుమేహంతో ఆరోగ్యంపై దుష్ప్రభావం



మాట్లాడుతున్న డాక్టర్ విజయభాస్కర్

కర్నూలు(హాస్పిటల్): మధుమేహ వ్యాధి అన్ని అవయవాలపై ప్రభావం చూపుతుందని ట్రెనింగ్ రీసోర్స్ పర్సన్ డాక్టర్ విజయభాస్కర్ చెప్పారు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అసంక్రమిత వ్యాధులలో భాగంగా క్యాన్సర్ వ్యాధిపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే సామాజిక అధికారులకు, యూపీహెచ్‌సీల్లో పనిచేసే ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంచార చికిత్స నోడల్ అధికారి డాక్టర్ రఘు పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయభాస్కర్ మాట్లాడుతూ.. షుగర్ ఉన్న వారు అశ్రద్ధ చేస్తే గుండె, కంటి చూపుపై ప్రభావం చూపిస్తుందని, చూపు కోల్పోవడం, కాళ్లు తొలగించాల్సి రావడం, నరాలు చచ్చుబడి గుండె పోటు, పక్షవాతం వంటివి సంభవిస్తాయని తెలిపారు. డాక్టర్ సాహితి జయరాం మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన మహిళలు ప్రతి నెలా రుతుక్రమం పూర్తయిన ఐదు రోజుల తర్వాత శరీరాన్ని చేతుల ద్వారా పరీక్షించుకోవాలన్నారు. ఏమైనా మార్పులు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, డెంటల్ డాక్టర్ హడస్సా, ఆర్‌కేఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున, ఫైనాన్స్ కన్సల్టెంట్ అరుణ, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

16న రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం

కర్నూలు(సెంట్రల్): రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని సెప్టెంబర్ 16వ తేదీన సీఆర్ భవన్ లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఏపీ రైతు సంఘం గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం ముఖ్య అతిథులుగా హాజరవుతారని వెల్లడించారు.

సీతారాం ఏచూరికి నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(అర్బన్): సీపీఎం అగ్ర నాయకుడు సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కర్నూలు బ్రాంచ్ యూనియన్ సెక్రటరీ ఆర్.సునీయకుమార్ ఏచూరి సేవలను కొనియాడారు.

కర్నూలు(సెంట్రల్): సుందరయ్య జంక్షన్‌లో సీతారాం చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ తదితరులు నివాళులర్పించారు. శనివారం జరిగే 'వర్తమాన రాజకీయాలు–సీపీఎం వైఖరి' సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): ఎల్‌ఆర్‌ఎస్ (లేఔట్ రెగ్యులేషన్ స్కీమ్) పథకంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. శుక్రవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో ఓపెన్ ఫోరం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. సచివాలయాల పరిధిలో అక్రమ నిర్మాణాలు గుర్తించి చార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. ప్లానింగ్ కార్యదర్శులపై ఫిర్యాదులు వస్తున్నాయని, నలుగురు ప్లానింగ్ కార్యదర్శులతో పాటు సూపరింటెండెంట్ సుబ్బన్నకు మెమో జారీ చేయాలన్నారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 15వ తేదీన విజయవాడలోని లేబర్ ఆఫీసు ముట్టడిని విజయవంతం చేయాలని ఆ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం గడియారం ఆసుపత్రి ఎదుట ఆ సంఘం నగర ప్రధాన కార్యదర్శి ఎస్.ఖాజాపాషా, సీఐటీయూ నగర నాయకుడు అబ్దుల్ దేశాయ్, ఎస్ఎండీ మూసా చాంద్‌బాషా, రైల్వే స్టేషన్ రోడ్డులో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.నరసింహులు, జి.ఏసు ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. వెంటనే భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుంచి మళ్లించిన రూ.4,298 కోట్లను జమ చేయాలని డిమాండ్ చేశారు. సిమెంట్, స్టీలు రేట్లను తగ్గించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లభించేలా చూడాలన్నారు.

ఉల్లి నాణ్యతగా ఉంటేనే మద్దతు ధర

కర్నూలు(అగ్రికల్చర్): రైతులు పండించిన ఉల్లిని బాగా ఆరబెట్టి గ్రేడింగ్ చేసుకొని మార్కెట్‌కు తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ నవ్య సూచించారు. శుక్రవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన ఉల్లి నాణ్యతను పరిశీలించారు. మార్కెట్‌కు 8316 క్వింటాళ్ల ఉల్లి రాగా వ్యాపారులు 3891 క్వింటాళ్లు, మార్క్‌ఫెడ్ 4425 క్వింటాళ్లు కొనుగోలు చేసింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. శని, ఆదివారాల్లో మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లిని వేలం వేస్తున్నందున రైతుల నుంచి ఉల్లి కొనుగోలు జరగదని తెలిపారు. ఉదయం 11 గంటలకు వేలంపాట ఉంటుందని, హోల్‌సేల్, రీటైల్ వ్యాపారులు, ఇతరులెవరైనా పాల్గొనవచ్చన్నారు. రైతులు తాడేపల్లిగూడెం మార్కెట్‌కు ఉల్లిని తీసుకెళ్లవచ్చని రూ.1200 కంటే తక్కువ ధరకు అమ్ముకుంటే వ్యత్యాసం అమౌంటు మార్క్‌ఫెడ్ ద్వారా చెల్లిస్తామన్నారు. మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డీడీ లావణ్య, ఏడీ నారాయణ మూర్తి, సెక్రటరీ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు రూ.25 వేలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): లైసెన్స్ ఉన్న ఆటో, క్యాబ్, లారీ, టిప్పర్ డ్రైవర్లకు వాహన మిత్ర కింద రూ.25 వేల ఆర్థిక సాయాన్ని దసరాకు అందజేయాలని ఆటో యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు దూదేకొండ కుమార్, మహ్మద్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. స్త్రీ శక్తి పథకం వల్ల ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ క్రమంలో వాహన మిత్ర కింద రూ.15 వేలు ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడం ఏమాత్రం ఆమోద్య యోగం కాదన్నారు. ఆటో డ్రైవర్లకు రూ.25 వేలు ఇవ్వాలని కోరారు. ఆలాగే ఆర్‌టీఓ కార్యాలయాల ప్రైవేటీకరణ చేయరాదని డిమాండ్ చేశారు.


అక్టోబర్ 16, 17న చెస్ పోటీలు

కర్నూలు (టౌన్): నగర శివారులోని సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అఖిల భారత చెస్ సమాఖ్య, ఆంధ్రా చెస్ అసోసియేషన్, కర్నూలు చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 16, 17 తేదీల్లో అంతర్జాతీయ ఓపెన్ రాపిడ్ బ్లిట్జ్ రేటింగ్ చెస్ టోర్నమెంటు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ రవినాయక్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక శ్రీనివాసనగర్‌లో టోర్నమెంటు పోస్టర్లను ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, నాయకులు కేఈ క్రిష్ణమూర్తి, తిక్కారెడ్డి, విష్ణువర్దన్ రెడ్డి తదితరులు ఆవిష్కరించారు. విజేతలకు రూ. 3 లక్షల ప్రైజ్‌మనీ అందిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 87904 43030 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వాహనం ఢీకొని హమాలీ మృతి

కర్నూలు: కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కురువ మిన్నెల్లా (68) అక్కడికక్కడే మృతిచెందాడు. కోడుమూరు మండలం కృష్ణాపురానికి చెందిన మిన్నెల్లా నగర శివారు పెద్దపాడు రోడ్డులోని డ్రైవర్స్ కాలనీలో నివాసముంటున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు, కూతురు సంతానం. స్థానికంగా హమాలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గురువారం రాత్రి 10:30 గంటల సమయంలో కొడుకు సుధాకర్‌తో కలిసి బైక్‌పై పెద్దపాడు వైపు నుంచి బళ్లారి చౌరస్తా వైపు వస్తుండగా ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద వెనుక నుంచి గుర్తు తెలియని ఐచర్ వాహనం ఢీకొట్టింది. బైక్‌పై నుంచి ఇద్దరూ కింద పడ్డారు. ఐచర్ వాహనం టైరు మిన్నెల్లా తలపై వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. బైకు నడిపిన సుధాకర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. వెంటనే తండ్రిని అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీ కేంద్రంలో భద్రపరిచారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలి



మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవికి వినతి పత్రం అందిస్తున్న డీహెచ్‌పీఎస్ నేతలు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వెంటనే విడుదల చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సి.మహేష్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప కోరారు. శుక్రవారం ఇక్కడకు వచ్చిన ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవిని వారు కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను విడుదల చేయాలన్నారు. అలాగే కోనేరు రంగారావు భూ సిఫారసులను అమలు చేయాలన్నారు. డీహెచ్‌పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కుమార్ రాజా, జిల్లా కోశాధికారి సి.కుమార్, జిల్లా సమితి సభ్యులు నాగరాజు తదితరులు ఉన్నారు.

రికవరీ పూర్తయ్యాకే ఎస్సీలకు రుణాలు

కర్నూలు(అర్బన్): ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకాలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారుల నుంచి రికవరీ పూర్తయ్యాకనే ఈ పథకాల ద్వారా రుణాలను అందిస్తామని ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. రెగ్యులర్ రుణాలకు సంబంధించి లబ్ధిదారులకు అనుకూలంగా యూనిట్లలో మార్పు, వివిధ పథకాలకు యూనిట్ విలువ పెంపు తదితర అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నందున రుణాల ప్రక్రియలో జాప్యం చోటు చేసుకుంటోందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.తులసీదేవి, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్, ఈఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వీసీ వెంకట బసవరావు, తదితరులు

కర్నూలు కల్చరల్: మహిళల ఆరోగ్యమే కుటుంబానికి క్షేమమని ఆర్‌యూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆర్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో హైజినిక్ ఆర్గానిక్ శానిటరీ ప్యాడ్ల వినియోగంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. వీసీ మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం సక్రమంగా ఉంటుందన్నారు. ఇంటా బయటా రకరకాల బాధ్యతలు నిర్వహించే మహిళలు వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. మాస్టర్ ట్రైనర్ డాక్టర్ బి.సంధ్యారాణి మాట్లాడుతూ.. యుక్త వయసు మహిళలకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యల గురించి నిపుణుల సలహాలు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీవీ కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు మాట్లాడారు.

దోమలను నివారించాలి



డ్రమ్ములోని నీటిలో లార్వాను పరిశీలిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): చిన్నారులకు దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి చెప్పారు. శుక్రవారం స్థానిక రోజా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ధర్మపేటలో ఫ్రైడే – డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. చిన్నారులు, వృద్ధులకు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుందని, వారి పట్ల పెద్దలు మరింత జాగ్రత్త వహించాలన్నారు. దోమ తెరలు ఏర్పాటు చేసి దోమలు కుట్టకుండా చూసుకోవాలన్నారు. పగటి పూట దోమలు కుడితే డెంగీ వ్యాధి వస్తుందన్నారు. ఈ దోమలు నీటిలో పెరుగుతాయని, కావున ఇంటి ఆవరణలో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పద్మావతి, ఆరోగ్య కార్యకర్త సంజమ్మ, ఆశా కార్యకర్త సుజాత పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలి



కలెక్టరేట్ ఏఓ ఆర్.శివరాముడుకు వినతిపత్రం ఇస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను కల్పించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల పదవీ కాలం ముగిసిన తరువాత ఆరు నెలల్లోపు ఎన్నికలను నిర్వహించవచ్చని, ఈలోపు సమగ్రంగా కులగణన జరిపి ప్రాదేశిక నియోజకవర్గాల విభజన చేసి దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల గడువు ముగియడానికి మూడు నెలల ముందే ఎన్నికలు జరిపితే బీసీ రిజర్వేషన్ల కల్పనకు ఆటంకం కలుగుతుందన్నారు. ఈ మేరకు శుక్రవారం కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ కలెక్టరేట్ ఏఓ శివరాముడుకు వినతి పత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. సమాజంలో వెనుకబడిన బీసీలకు ఎస్సీ, ఎస్టీ తరహాలో అట్రాసిటీ తెస్తామని వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. చట్ట సభల్లో, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌బాబు , సీనియర్ నాయకులు వాడాల నాగరాజు, నాగార్జున గౌడ్, కల్యాణ్, ఎద్దుపెంట అంజి, దామోదర్ గౌడ్, అంజి పాల్గొన్నారు.

బీసీలకు 50 ఏళ్లకు పింఛన్ ఎప్పుడు?

ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇప్పటి నుంచి ఇస్తారో చెప్పాలని డీసీసీ మాజీ సెక్రటరీ సుబ్రమణ్యం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో.. బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే ఇవ్వాలని, ఆర్‌టీసీ ఉద్యోగులకు ఇస్తామన్న డీఏ ఎందుకు ఇవ్వలేదని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరారు.

డైట్ కాలేజీలో కళా ఉత్సవ్



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ అయూబ్ హుసేన్, నంద్యాల డీఈఓ జనార్దన్ రెడ్డి

కర్నూలు సిటీ: నగర శివారులోని ప్రభుత్వ డైట్ కాలేజీలో రెండు రోజుల పాటు నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ అయూబ్ హుసేన్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో నంద్యాల డీఈఓ జనార్దన్ రెడ్డి అతిథిగా పాల్గొన్నారు. పోటీల్లో పి.జశ్వంత్ రామ్ ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ సోలో విభాగంలో, నృత్యంలో ఎం.వెంకటలక్ష్మీ, ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్‌లో ఎం.ఓంకార్, విజువల్ ఆర్ట్స్‌లో సి.రోహిణి, బి.రోహిణి విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు. అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నాప్కిన్స్ పంపిణీ

కర్నూలు (అర్బన్): స్త్రీ శిశు సంక్షేమ, సాధికారత అధికార విభాగం ఆధ్వర్యంలోని వన్‌స్టాప్ సెంటర్ ద్వారా సంకల్ప్ ప్రోగ్రాం పది రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమీపంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్‌లో ఉన్న విద్యార్థినులకు శానిటరీ నాప్కిన్స్ పంపిణీ చేశారు. ప్రాజెక్టు డైరెక్టర్ పి.విజయ, సమాచార శాఖ డీడీ జయమ్మ, అగ్రికల్చర్ ఆఫీసర్ వరలక్ష్మి నాప్కిన్స్‌ను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. రుతుక్రమం సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, శుభ్రత, పోష్టికాహారంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఓఎస్‌సీ అడ్మిన్ మేరీ స్వర్ణలత, జోష్టనా ప్రియాంక, సునిత పాల్గొన్నారు.


20న నగర బ్రాహ్మణ సమావేశం

కర్నూలు(అర్బన్): ఈ నెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు స్థానిక సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రం ఆవరణలో నగర బ్రాహ్మణ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం క్షేత్రంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సమావేశానికి ముఖ్య అతిథిగా ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ హాజరవుతున్నారన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు చెరువు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. పేద బ్రాహ్మణులకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వృద్ధాప్య, వితంతు పెన్షన్లు, కార్పొరేషన్ రుణాల గురించి సవేశంలో చర్చించనున్నట్లు వెల్లడించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

కర్నూలు(సెంట్రల్): భార్యపై అనుమానంతో కుమారుడిని చంపిన చాకలి నరేష్‌ను ఉరి తీయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణిరెడ్డి, నగర కార్యదర్శి వి.భారతి డిమాండ్ చేశారు. నరేష్ దాడిలో తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతని భార్య శ్రావణిని వారు శుక్రవారం పరామర్శించారు. శ్రావణిపై అనుమానంతోనే నరేష్ కుమారుడిని చంపి భార్యను విచక్షణ రహితంగా కొట్టినట్లు చెప్పారు. గతంలో మొదటి భార్యను చంపాడని, రెండో భార్యను కూడా చంపేందుకు ప్రయత్నించాడని, అతన్ని ఉరి తీయాలని కోరారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటండి



క్రీడాదుస్తులు పంపిణీ చేసిన డీఎస్‌డీఓ, న్యాయవాది శ్రీధర్ రెడ్డి

కర్నూలు (టౌన్): కాకినాడ జిల్లాలోని మండపేట ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న 49వ సీనియర్ టెన్నికాయిట్ పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు, న్యాయవాది జి.శ్రీధర్ రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జట్లకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో టెన్నికాయిట్ అతి తక్కువ కాలంలో ప్రాచుర్యం పొందిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నూతన క్రీడా పాలసీలో టెన్నికాయిట్‌కు చోటు కల్పించిందన్నారు. రాష్ట్ర పోటీలకు బాలుర జట్టులో రాకేష్, అనిల్‌కుమార్, గణేశ్వర్ రెడ్డి, అఖిల్, సురేష్ బాలికల జట్టులో వెంకటలక్ష్మి, జెస్సీ, వర్షిని, ఈశ్వరీ ఎంపికైనట్లు టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి రమణ పాల్గొన్నారు.